సాక్షి బాపట్ల

ఆదివారం । 21 । మే । 2023




నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,800, గరిష్ట ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,400 వరకు పలికింది.



పిడుగుపడి చెట్టు దగ్ధం

సత్తెనపల్లి: ఇళ్ల మధ్య ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన సంఘటన పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో శనివారం జరిగింది. దీంతో కొబ్బరి చెట్టు మొదళ్లలో మంటలు చెలరేగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

రేపు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం



బాపట్ల అర్బన్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ వార్షిక స్నాతకోత్సవంను వ్యవసాయ కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన డాక్టర్ బి.వి.నాథ్ ఆడిటోరియం నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం బాపట్ల ఏజీ కాలేజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 55వ వార్షిక స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, ఆహార శుద్ధి శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పాల్గొననున్నట్లు వెల్లడించారు. డిపార్టుమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ ఫరోడా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 993 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్టర్ జి.రామారావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ పి.సుధాకర్, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ సి.హెచ్.చిరంజీవి, అసోసియేటెడ్ డీన్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గవర్నర్ కోసం ఏర్పాట్లు పరిశీలన

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఈనెల 22న జరగనున్న 55వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్న దృష్ట్యా ఏర్పాట్లను జేసీ శ్రీధర్ పరిశీలించారు. కళాశాల్లోని బి.వి.నాథ్ ఆడిటోరియాన్ని పరిశీలించారు. విజిటర్ల రాక, విద్యార్థులు కూర్చోనేందుకు ఏర్పాట్లుపై వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గోడౌన్ల పరిశీలన..

బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ గోడౌన్లను జేసీ శ్రీధర్ పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్లను తరచుగా విజిట్ చేయాల్సిందిగా ఆర్డీఓ రవీంద్రబాబును ఆదేశించారు. తహసీల్దార్ సుధారాణి ఉన్నారు.

జేవీకే కిట్లు పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ గర్ల్స్ హైస్కూల్‌లో నిల్వ చేసిన జగనన్న విద్యాకానుక కిట్లను శనివారం ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా గుంటూరు అర్బన్, రూరల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు పంపిణీకి సిద్ధం చేస్తున్న జేవీకే కిట్లలోని బ్యాగులు, యూనిఫాం, పుస్తకాలను పరిశీలించిన రవీంద్రనాథ్ రెడ్డి పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తిస్థాయిలో సామగ్రి వస్తుందని చెప్పారు. ఆయన వెంట జిల్లా పాఠ్య పుస్తక మేనేజర్ వి.వజ్రబాబు, సీఆర్పీలు ఉన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

నరసరావుపేట: జిల్లాలోని 21 జగనన్న కాలనీల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం కోసం తాత్కాలిక నీటిసరఫరా చేసేందుకు మోటార్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆశాఖ ఎస్ఈని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశం హాలులో నవరత్నాలు-పేదలందరికీ గృహాలు పథకంలో జరుగుతున్న పనులపై మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఇక్కుర్రు లేఅవుట్‌లో పదిరోజుల్లో పనులు పూర్తిచేసి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈని ఆదేశించారు.

పేదలంటే బాబుకు చిన్నచూపు

రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

- బాబుకు ప్రజలే రాజకీయ సమాధి కట్టే రోజులు దగ్గరలో ఉన్నాయి
- పేదలకు మేలు జరుగుతుంటే ఓర్వలేకే ఈ వ్యాఖ్యలు
- వేమూరు నుంచి కొల్లూరు వరకు పాదయాత్ర
- చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని అనంత భోగేశ్వరాలయంలో పూజలు



కొల్లూరు అనంతభోగేశ్వరాలయంలో చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజలు చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: మతిభ్రమించి పేదలను కించ పరిచేలా వ్యాఖ్యలు చేస్తున్న బుద్ధిమాంద్య చంద్రబాబు నాయుడుకి బుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటూ రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అనంతభోగేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. విశాఖ జిల్లా పెందుర్తిలో చంద్రబాబు నాయుడు పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఇళ్ల స్థలాలను స్మశానాలతో పోలుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం రాత్రి మంత్రి మేరుగ బాపట్ల జిల్లా వేమూరు నుంచి బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, భారీగా హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి కొల్లూరు వరకు 5 కిలోమీటర్లు మేర పాదయాత్ర చేశారు. పాదయాత్ర అనంతరం కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని అనంత భోగేశ్వరాలయంలో పేదలను చిన్నచూపు చూస్తున్న చంద్రబాబుకు బుద్ధిని ఇవ్వాలని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కొల్లూరు బస్టాండ్ సెంటర్లో మంత్రి మాట్లాడుతూ, 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు పేదవర్గాలకు ఏఒక్క మేలు చేయకపోగా, బడుగు, బలహీన వర్గాలు, ఉన్నత కులాల్లోని పేదలకు సంక్షేమ పథకాలు అందుతుంటే వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం నీతిబాహ్యమైన చర్యగా అభివర్ణించారు. రాష్ట్రవ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 31 లక్షల మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తుంటే, ఓర్చుకోలేని చంద్రబాబు నివేశనా స్థలాలను స్మశానాలుగా పోల్చుతూ మాట్లాడటం పేద వర్గాలపై అతనికి ఉన్న చులకనభావానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా రూ. లక్షల కోట్లు ప్రజలకు నేరుగా అందజేస్తున్న తరుణంలో ప్రభుత్వ పార పాట్లను వేలెత్తి చూపే అవకాశం లేక చంద్రబాబు నాయుడు అసెంబ్లీకి సైతం రాకుండా పారిపోయి, ప్రజలను మభ్యపెట్టేందుకు కుటిల రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. గతంలో కుల, మత రాజకీయాల ప్రస్తావన తీసుకువచ్చి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు నైజాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. దళితుల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని దళిత జాతిని అవమానించిన చంద్రబాబు, బీసీల అంతుచూస్తానని, తోకలు కత్తిరిస్తానని గతంలో వ్యాఖ్యలు చేయడం, ఇప్పుడు పేదల ఇళ్ల స్థలాలను స్మశానాల కింద జమకట్టడం పేద వర్గాలను తీవ్ర అవమానానికి గురి చేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. మతిభ్రమించి అప్రజాస్వామిక, అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్న చంద్రబాబుకు, టీడీపీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే రాజకీయంగా సమాధి కట్టనున్నారని అన్నారు.

బాబుకు ప్రజల చేతిలో రాజకీయ సమాధి తథ్యం..

కొల్లూరు: రాష్ట్రంలో పేదలకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇస్తున్న ఇళ్ల స్థలాలను శవాలను పూడ్చడానికి కూడా చాలవంటూ అవమానపరిచేలా మాట్లాడిన చంద్రబాబుకు రాజకీయ సమాధి తథ్యమని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చంద్రబాబు చేసిన అప్రజాస్వామిక, అహంకారపూరిత వ్యాఖ్యలను ఖండిస్తూ భారీఎత్తున తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి శనివారం ఆయన నియోజకవర్గ కేంద్రం వేమూరు నుంచి కొల్లూరు బస్టాండ్ సెంటర్ వరకు ఐదు కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొల్లూరు బస్టాండ్ సెంటర్లో ప్రసంగించిన ఆయన 14 ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఒక్కో ఊరిలో పట్టుమని పదిమందికి ఇళ్ల స్థలాలు ఇచ్చిన దాఖలాలు ఉంటే చూపాలని సవాలు విసిరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న అన్ని వర్గాల పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇస్తూ సొంతింటి కలను నిజం చేయడంతోపాటు, సంక్షేమ పథకాల రూపంలో లక్షల కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తూ కష్టాల నుంచి గట్టెక్కిస్తుంటే చంద్రబాబు మతిభ్రమించి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ఎవ్వరు ఏమిచేశారు. అవినీతి రహిత పాలన ఎవ్వరు చేస్తున్నారన్న విషయంలో చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబుతో బహిరంగ చర్చకు ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధమేనని ఆయన సవాలు విసిరారు.

వేగంగా మౌలిక వసతులు

ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ లే అవుట్‌లో జిల్లా కలెక్టర్ పరిశీలన



గృహ యజమానులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. పక్కాగృహాల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బాపట్లలోని ప్యాడిసన్ పేట జగనన్న కాలనీ లే-అవుట్‌ను జిల్లా కలెక్టర్ శనివారం పరిశీలించారు. పేదల పక్కా గృహ నిర్మాణాలకు అవసరమైన ఇనుము, ఇసుక, సిమెంట్ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ తెలిపారు. జగనన్న కాలనీలలో రహదారులు వేగంగా నిర్మించాలన్నారు. ముఖ్యంగా నీటి వనరులను సమకూర్చాలన్నారు. ప్యాడిసన్ పేటలో 1,746 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరు చేయగా ప్రస్తుతం 615 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. 54 గృహాలు శ్లాబ్ దశకు రాగా, 167 భవనాలు రూఫ్ దశలో ఉన్నవి శ్లాబ్ వేసేలా చూడాలన్నారు. మరో 704 గృహాలు పునాది దశలో నిర్మాణాలు జరుగుతుంటే వాటిని రూఫ్ దశకు చేరేలా నిర్మాణాలు చేపట్టాలన్నారు. అలాగే 206 గృహాలు పునాదికి దిగువన ఉన్నాయని, వాటి నిర్మాణాలు మొదలయ్యేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. గృహ నిర్మాణ సామగ్రి లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారులు గృహాలు నిర్వహించుకునేలా రుణ సదుపాయం కల్పించాలన్నారు. అవసరమైతే ఆయా గృహాలకు మేస్త్రులను జతచేసి అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయన ఆదేశించారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక రూపొందించి, అంచనాలు సిద్ధం చేయాలన్నారు. సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అలసత్వం వీడి చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. తమకు నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పురోగతి సాధించేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాతో పాటు బాపట్ల ఆర్డీఓ జి.రవిందర్, గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, బాపట్ల మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు, మెప్మా సిబ్బంది, తదితరులు ఉన్నారు.

టంగుటూరి ప్రకాశం అందరికీ స్ఫూర్తి

ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు ముని మనమడు మురళి



బహుమతులు అందజేస్తున్న ప్రకాశం మిత్రమండలి

అద్దంకి: ఆంధ్రకేసరి టంగుటూరి స్ఫూర్తితో విద్యార్థులంతా ముందుకు సాగాలని ఆయన మునిమనమడు కొండపి మురళి అన్నారు. ఆంధ్రకేసరి జాతీయ పరిషత్ జీవిత సాఫల్య పురస్కారాన్ని విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రావినూతల శ్రీరాములుకు ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి భైరవునేని సూర్యనారాయణ శనివారం తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 133 మంది విద్యార్థులకు టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా వాసవీనగర్‌లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. తొలుత బంగ్లా రోడ్‌లోని ప్రకాశం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రకేసరి జాతీయ పరిషత్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి హాజరయ్యారు. ప్రకాశం మునిమనమరాలు సుభాషిణి పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల మధ్య ఉద్రిక్తత

- ఘర్షణలో ఇద్దరికి గాయాలు
- రెండు గ్రామాల్లో పోలీస్ పికెట్, బందోబస్తు ఏర్పాటు



కఠారివారిపాలెంలో పోలీస్ బందోబస్తు

వేటపాలెం: మత్స్యకార గ్రామాల మధ్య శనివారం ఉద్రిక్తలు చోటుచేసుకున్నాయి. మండల పరిధిలోని రామాపురం – కఠారివారిపాలెం గ్రామాల మధ్య జరగిన ఘర్షణలో రామాపురం గ్రామానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. రెండు గ్రామాల్లో పోలీస్ పికెట్, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆరు నెలల కిందట రామాపురం మత్స్యకార గ్రామంలో గ్రామానికి చెందిన పామంజి శేషగిరి గ్రామానికే చెందిన మరో కుటుంబంపై చేతబడి చేశారని అనుమానంతో కొంత మంది గ్రామస్తులు అతన్ని కొట్టి గ్రామం మధ్యలో నిర్బంధించారు. దీనిపై అప్పట్లో పోలీసులు జోక్యం చేసుకొని ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి పరిస్థితిని చక్కదిద్దారు. అనంతరం తరచూ గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. చేతబడి చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్గానికి చెందిన దాదాపు 110 కుటుంబాలు గ్రామం విడిచి పక్కనే ఉన్న మరో మత్స్యకార గ్రామం కఠారివారిపాలెం ఊరు చివర టెంట్‌లు వేసుకొని ఆరునెలలుగా ఉంటున్నారు. వారికి జరిగిన అన్యాయాన్ని పరిశీలించి న్యాయం చేయాలని కోరుతూ బాధితులు ఉమ్మడి ప్రకాశం జిల్లా మత్స్యకార గ్రామాల పెద్దల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై మత్స్యకార గ్రామాల పెద్ద కాపులు వచ్చి కఠారివారిపాలెంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రామాపురానికి చెందిన పెద్దలు వాయిల వెంకటేశ్వర్లు, కఠారి అంకయ్య మరో నలుగురు ఆటోలో వచ్చారు. పెద్దల సమావేశం జరుగుతున్న సందర్భంలో రామాపురం నుంచి వలస వచ్చిన బాధితులు వారి గ్రామపెద్దలతో ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో రామాపురం పెదలు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు చీరాల ఏరియా వైద్యశాలకు వెళ్లారు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ జి.సురేష్ ఘటనా స్థలానికి చేరుకొని ఉద్రిక్తలు జరకుండా చర్యలు చేపట్టారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి రెండు గ్రామాల్లో పికెట్ ఏర్పాటు చేశారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తలశిల, కలెక్టర్

వెంకటపాలెం(తాడికొండ): సీఆర్డీయే పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఈ నెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, శాసన మండలి సభ్యుడు తలశిల రఘురామ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నిర్మలా, సీఆర్డీయే, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ద్రోహి చంద్రబాబు



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి, నాయకులు



మేదరమెట్లలో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్న కృష్ణచైతన్య

- ఇళ్ల స్థలాలపై చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన ర్యాలీ
- పాల్గొన్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

పర్చూరు (చినగంజాం): పేదలకు ప్రభుత్వం ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చటానికి కూడా సరిపోదంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ మండిపడ్డారు. శనివారం పర్చూరులో పార్టీ కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు జరిగిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. దివంగత నేత వైఎస్సార్, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వంగవీటి మోహనరంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజధానిలో పేదలు నివాసం ఉండటం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. పేదలంటే చంద్రబాబుకు ఎందుకంత చిన్నచూపు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతిలో పేదలకు 50 వేల ఇళ్లు ఇస్తుంటే రాజధాని ప్రాంతం ఎందుకు అభివృద్ధి కాదని ఆయన సూటిగా ప్రశ్నించారు. శుభమా అంటూ నూతన గృహాలను పేద ప్రజలకు ఇస్తుంటే వాటిని శవాలతో పోల్చటం చంద్రబాబు వికృత చేష్టలకు నిదర్శనమన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణ విషయంలో కూడా షాపూర్‌జీ పల్లోంజీ, ఎన్‌సీసీ, ఎల్అండ్‌టీ సంస్థల నుంచి చంద్రబాబు భారీగా లబ్ధి పొందారని ఆమంచి విమర్శించారు. టిడ్కో ఇళ్ల కోసం సేకరించిన స్థలంలో భారీగా అవినీతి జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రూపాయితోనే ఇంటి నిర్మాణాన్ని అన్ని హంగులతో పూర్తి చేసి రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తున్నారని ఆమంచి కొనియాడారు. చంద్రబాబు గత చరిత్ర గురించి అందరికీ తెలుసునని ఆయన చెప్పే మాటలను ప్రజలెవరు నమ్మే స్థితిలో లేరని ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు తగిన చెప్తారని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పర్చూరు ఎంపీపీ మేకా ఆనంద కుమారి, మాజీ ఎంపీపీ కోట హరిబాబు, కారంచేడు జెడ్పీటీసీ యార్లగడ్డ రజని, కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాటుకూరి బాబురావు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు సిగ్గుచేటు

మేదరమెట్ల (అద్దంకి రూరల్): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అడుగడునా ఆటంకాలు సృష్టిస్తూ చంద్రబాబు ద్రోహిగా మారారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, పార్టీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణచైతన్య ధ్వజమెత్తారు. అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శనివారం మేదరమెట్లలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా వచ్చి వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ అమరావతిలో పేదలకు 50 వేల ఇళ్ల స్థలాలను మంజూరు చేయటం చంద్రబాబు జీర్ణించుకోలేక అహంకారపూరిత వ్యాఖ్యలు చేసి పేదలను అవమానించారన్నారు. సెంటు భూమి శవాలను కూడా పూడ్చేందుకు పనిరాదని వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో పేదప్రజలంతా చంద్రబాబుకు బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, మాజీ సర్పంచ్ జజ్జర ఆనందరావు, కొరిశపాడు, అనమనమూరు సర్పంచ్‌లు విజయ్‌కుమార్, జంపు హరిబాబు, సాధినేని మస్తాన్‌రావు, డాన్ శ్రీను, జ్యోతి రమేష్, మన్నె సుబ్బారావు, సందిరెడ్డి రమేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జేవీకే కిట్ల పంపిణీ సమర్థంగా చేపట్టాలి

చినగంజాం: జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సూచించారు. శనివారం ఆయన చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు చేరిన కానుకలోని వస్తువులు, యూనిఫాం కొలతలు, షూస్, బెల్ట్‌లు తదితర వస్తువుల వివరాలను పరిశీలించారు. వివరాలను మండల ఇన్‌చార్జి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ ఎం డీ రత్నకుమారిని అడిగి తెలుసుకున్నారు. బ్యాగ్‌లు, షూస్, బెల్టులు ప్రతి పాఠశాలకు రూట్ మ్యాప్ తయారు చేసుకొని ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని సీఆర్పీలు వెంట ఉండి అన్ని పాఠశాలలకు జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మాజేటి మురళి, సీఆర్పీలు చాట్ల సురేంద్ర కుమార్, మేడికొండ ఆశీష్, సునీల్, రామకృష్ణారెడ్డి, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్ వాణి, ఐఈఆర్టీ బాలకృష్ణ, రాజు మురళి పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

- రూ.2లక్షలు, వెండి వస్తువులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకటేశ్వర్లు

బాపట్ల: దొంగతనాలే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతూ చెడు వ్యసనాలకు బానిసలైన ఇద్దరు నిందితులను బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2లక్షలు నగదు, వెండివస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా అమరావతి రోడ్డు శారద కాలనీకి చెందిన చిల్లర సురేష్, పెద్ద నందిపాడుకు చెందిన కిరణ్‌బాబు బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెంలో ఓ ఇంటిలో బంగారం, రెండు లక్షల నగదు అపహరించారన్నారు. పెదనందిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు గృహాలలో బంగారు వెండిని చోరీ చేయడంతో పాటు, చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రాంతంలో వెండితో పాటు, రూ.75 వేలు చోరీ చేశారన్నారు. ఈనెల 19వ తేదీన బాపట్ల మండలం ఉప్పరపాలెంలో నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో ఎస్ఐ ప్రసాద్‌కు అందిన సమాచారంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించారన్నారు. చిల్లర సురేష్‌పై 70 కేసులు, కిరణ్‌పై 30 కేసులు ఉన్నాయని వివరించారు. వీరి నుంచి వెండి వస్తువులు, రూ.రెండు లక్షలు స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నామన్నారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అరెస్టు చేసిన సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ వెంకటప్రసాద్‌ని అభినందించారు.

ఎంఈఓ అవినీతి ఆరోపణలపై ఆర్జేడీ విచారణ

విచారణకు గైర్హాజరు


బల్లికురవ ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ

బల్లికురవ: ఎంఈఓ బి.రాఘవయ్యపై వచ్చిన అవినీతి ఫిర్యాదులపై పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు శనివారం విచారణ చేపట్టారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. రెండేళ్లుగా ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయటం దుర్భాషలాడటం, అవినీతిపై ఇటీవల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలసి యూటీఎఫ్ నాయకులు ఆర్జేడీతో పాటు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, డీఈఓ రామారావు, ఎంపీడీఓ సీహెచ్ కృష్ణ, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు లిఖిత పూరకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. బాధిత ఉపాధ్యాయులు ఎ.పవిత్ర, సుజాత, రాణి, సుమని, జాన్‌రాజ్, కె.ఏడుకొండలు, చెన్నారెడ్డి, పుల్లారెడ్డిలను విచారించారు. పింఛన్ చెల్లింపు, జీతం పెంపు, చైల్డ్ కేర్ బిల్లులు, మెడికల్ లీవ్ బిల్లులు, డెప్యూటేషన్, తుఫాన్ సందర్భంగా వరద బాధితుల సహాయ నిధి పేరిట, కార్యాలయ ఖర్చులు, దినపత్రికల బిల్లులు చెల్లింపు పేరిట తమ నుంచి ఎంఈఓ డబ్బు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు అంకాల్‌రెడ్డి, ఫైనాన్స్ వ్యాపారి కొండారెడ్డి ఇబ్బందులకు గురిచేసిన వైనంపై ప్రత్యేకంగా చర్చించారు. విచారణ సమయంలో ఎంఈఓ బీ రాఘవయ్య గైర్హాజరయ్యారు. అంతకు ముందు డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు రావడంతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తరువాత ఆర్జేడీ హాజరు కావడంతో ఉపాధ్యాయులు విచారణకు హాజరయ్యారు. ఆర్జేడీ వెంట పర్చూరు డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, ఆర్జేడీ కార్యాలయ ఏడీ కృష్ణ ఉన్నారు. కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు జిల్లా కలెక్టర్‌కు విచారణ నివేదికలు అందించనున్నట్లు ఆర్జేడీ విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివారావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, మండల శాఖ బాధ్యుడు డీ శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి గాలం రామాంజనేయులు, పాలపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపాలి

జెడ్పీ సీఈఓ మోహనరావు


మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహనరావు

భట్టిప్రోలు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై అధికారులు పురోగతి చూపాలని.. లేకుంటే సహించేది లేదని గుంటూరు జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి(సీఈఓ) జె. మోహనరావు అన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్, మండల సమాఖ్య సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. మోహనరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గృహ నిర్మాణాలపై తమకు బాధ్యత లేదన్నట్లు వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేసి లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మౌలిక సదుపాయాలు సమకూర్చినప్పటికి పురోగతి లేకపోవడంపై ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆ దిశగా వలంటీర్లతో ఎప్పటికప్పుడు భేటీ అవుతూ లబ్ధిదారులను గృహ నిర్మాణాలు చేపట్టేలా చేయాలని కోరారు. వారం రోజుల్లో గృహ నిర్మాణాలలో పురోగతి చూపాలని పేర్కొన్నారు. సచివాలయాల వారీగా గృహాలు కట్టుకోని లబ్ధిదారులు గూర్చి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడి ఎందుకు కట్టుకోవడంలేదో అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలలో వెనుకబడిన భట్టిప్రోలు, ఓలేరు, పెదపులివర్రు సచివాలయాల సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరుపీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, పాల్గొన్నారు.

చంద్రబాబూ నోరు అదుపులో పెట్టుకో

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: చంద్రబాబు వయసు మీద మతిస్థిమితం కోల్పోయి ఏదేదో మాట్లాడుతున్నాడు, నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్సీ పోతుల సునీత హెచ్చరించారు. శనివారం కొత్తపేటలోని నివసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అనకాపల్లి సభలో ఇష్టానుసారంగా మాట్లాడన్నారు. వెన్నుపోటు, మోసపూరిత రాజకీయాలు ఆయన చరిత్ర అన్నారు. అమరావతిని భ్రమరావతి చేశాడు, పోలవరాన్ని ఏటీఎంలా వాడుకున్నాడన్నారని విమర్శించారు. చంద్రబాబు దుర్మార్గపు మోసపూరిత మాటలతో ప్రజలను వంచించారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమరావతిలో 50 వేల మంది పేద ప్రజలకు ఇంటి నివేశన స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు.